www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023



ఆర్‌టిసి ఉద్యోగులకు పురస్కారాలు

ఏలూరు అర్బన్ : ఎపిఎస్ ఆర్‌టిసి ఏలూరు డిపోను విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏలూరు డిపోలో ఏప్రిల్ నెలకుగాను ఆదర్శ ఉద్యోగులకు పురస్కారాలు అందించారు. అధిక డీజిల్ ఆయిల్ తీసుకువచ్చిన ఉత్తమ డ్రైవర్లు, అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లకు, మెకానిక్‌లకు ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛం, శాలువా, నగదు పురస్కారం అందించారు. అదేవిధంగా ప్రయాణికులకు అనుగుణంగా మంచి సేవలందించాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజారవాణా అధికారి ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జోన్-2 పరిధిలోని ఏడు జిల్లాల్లో ప్రతీరోజు 2700 సర్వీసులు నడుస్తున్నాయని, పది లక్షల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. కోవిడ్ వల్ల వచ్చిన నష్టాలను అధిగమించి, నష్టాలు తగ్గించగలిగామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 287 సర్వీసులు నడుస్తున్నాయని, 20 కొత్త బస్సులు తీసుకురావడం జరిగిందని, వచ్చే ఒకటి, రెండు నెలల్లో మరో 15 కొత్త బస్సులు వస్తాయని తెలిపారు.

బటన్ నొక్కారు.. డబ్బులేవి..!

45 రోజులైనా జమకాని 'ఆసరా' సొమ్ము
ఉమ్మడి పశ్చిమలో 65 వేలకు పైగా డ్వాక్రా గ్రూపులు
70 శాతం సంఘాలకే డబ్బు జమ
'వసతి దీవెన' పథకం పరిస్థితి అదే
బటన్‌నొక్కి 15 రోజులైనా అందని వసతి దీవెన సొమ్ము
హాస్టల్ ఫీజులు చెల్లించలేక విద్యార్థుల అవస్థలు
పథకాల సొమ్ము ఆలస్యంపై జనాల్లో తీవ్ర చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం జమచేసే సొమ్ములు లబ్ధిదారులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం బటన్‌నొక్కి నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ సగమంది లబ్ధిదారులకు కూడా ఖాతాలకు సొమ్ము చేరలేదు. 45 రోజుల క్రితం దెందులూరులో బటన్‌నొక్కి విడుదల చేసిన డ్వాక్రా సంఘాల ఆసరా సొమ్ముగానీ, 15 రోజు క్రితం అనంతపురంలో బటన్ నొక్కి విద్యార్థులకు ఇస్తున్న వసతి దీవెన నగదుగానీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరలేదు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు వైసిపి హామీ ఇచ్చింది. డ్వాక్రా సంఘాలకు చేసే ఈ ఆర్థికసాయానికి 'ఆసరా' పథకంగా ప్రభుత్వం నామకరణం చేసింది. రెండు విడతల సొమ్ము జమచేయగా మూడో విడత సొమ్ము మార్చి 25వ తేదీన ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం బటన్‌నొక్కి విడుదల చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 65,417 డ్వాక్రా సంఘాలున్నాయి. ఏలూరు జిల్లాలో 39,539 సంఘాల్లో 3,89,446 మంది సభ్యులున్నారు. వీరికి మూడో విడతగా రూ.364.39 కోట్లు జమచేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమలో 25,878 గ్రూపులుండగా రూ.266.67 కోట్లు జమచేయాల్సి ఉంది. సిఎం బటన్ నొక్కిన తర్వాత ఎంఎల్‌ఎలు అంతా వారివారి నియోజకవర్గాల్లో డెమో చెక్కుల పంపిణీ చేసి హడవుడి చేశారు. ఆసరా సొమ్ము విడుదలకు సంబంధించి సిఎం బటన్‌నొక్కి 45 రోజులు గడిచింది. ఇప్పటి వరకూ సగానికి పైగా గ్రూపులకు మాత్రమే ఆసరా సొమ్ము జమ అయింది. మిగిలిన గ్రూపులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పశ్చిమలో ఇప్పటి వరకూ దాదాపు 12 వేల గ్రూపులకు రూ.120 కోట్లు జమైనట్లు తెలిసింది. ఇంకా 14 వేలకుపైగా గ్రూపులకు రూ.145 కోట్ల వరకూ జమకావాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో 39,539 డ్వాక్రా సంఘాల్లో 70శాతం పైగా గ్రూపులకు నగదు జమైనట్లు తెలుస్తోంది. ఆసరా డబ్బు జమకాకపోవడం డ్వాక్రా సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంకా డబ్బులు జమకావడానికి 15 రోజులు పట్టొచ్చని అధికారులు చెబుతుండటంతో ఇదేం తీరంటూ డ్వాక్రా సంఘాల మహిళలు ప్రశ్నిస్తున్నారు.

'వసతి దీవెన' పరిస్థితి అదేదారి

హాస్టల్లో చదువుకునే పేద విద్యార్థులకు భోజనం, వసతి కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు సిఎం జగన్ ప్రకటించారు. ఈ సొమ్ము జమ కూడా సవ్యంగా జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఏప్రిల్ 26వ తేదీన అనంతపురంలో వసతి దీవెన సొమ్ము విడుదలకు సిఎం బటన్‌నొక్కారు. 15 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ ఒకటో వంతు విద్యార్థులకు కూడా ఈ సొమ్ము జమకాలేదు. ఏలూరు జిల్లాలో వసతిదీవెన అందుకునే విద్యార్థుల సంఖ్య 33,316 వరకూ ఉంది. జమకావాల్సిన సొమ్ము రూ.30.96 కోట్లు. ఇప్పటి వరకూ జమైన సొమ్ము రూ.మూడు కోట్లలోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు మాత్రమే జమయ్యాయని, బిసి, ఇతర సామాజిక తరగతుల విద్యార్థులకు జమకావాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో వసతి దీవెన అందుకునే విద్యార్థులు 33,231 మంది ఉన్నారు. మొత్తం రూ.31.69 కోట్లు జమకావాల్సి ఉంది. ఈ జిల్లాలోనూ ఒకటో వంతు విద్యార్థులకు మాత్రమే ఈ సొమ్ము జమైనట్లు చెబుతున్నారు. మిగిలిన విద్యార్థులకు సొమ్ము జమకావడానికి 15 రోజులు సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చివరి నాలుగో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులంతా ఈనెల ఆరోతేదీకి చదువుపూర్తయింది. హాస్టల్ ఖాళీచేసి వచ్చేశారు. హాస్టల్ సొమ్ము మొత్తం చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు పట్టుబడుతున్నాయి. దీంతో వసతిదీవెన సొమ్ములు జమకాకపోవడంతో అప్పు చేసి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతు భరోసా, అమ్మఒడి పరిస్థితి ఏమిటి?

ఖరీఫ్ ఆరంభంలో రైతుభరోసా, స్కూల్స్ ప్రారంభమయ్యేనాటికి అమ్మఒడి పథకాలకు సంబంధించిన సొమ్ము విడుదల చేయాల్సి ఉంది. బటన్‌నొక్కిన పథకాలకు సంబంధించిన సొమ్ములే ఇంకా జమకాలేదు. బటన్ నొక్కాల్సిన పథకాల సొమ్ము ఎప్పటికి జమవుతుందోనన్న చర్చ లబ్ధిదారుల్లో కొనసాగుతోంది.



రచ్చబండలో మాట్లాడుతున్న చంద్రబాబు

రైతులను దగా చేస్తోన్న వైసిపి

ప్రభుత్వానికి అన్నదాత అంటే లెక్కలేదు
మిల్లర్లు ఏమైనా పెత్తందారులా..?
నూక పేరుతో రైతులను దోపిడీ చేయడం దారుణం
ఇరగవరం రచ్చబండలో చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/తణుకు రూరల్

'వైసిపి ప్రభుత్వానికి రైతులంటే లెక్కలేదు.. వారిని దగా చేస్తుంది.. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై రైతుల్లో చర్చ జరగాలి. వారిలో చైతన్యం రావాలి. అప్పుడే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ క్రమంలో వారికి టిడిపి నిత్యం అండగా ఉంటుంది.' అని పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రబాబు అన్నారు. గురువారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరంలో ఆయన పర్యటించారు. సాయంత్రం 7.30 గంటలకు తణుకు పట్టణానికి చంద్రబాబు చేరుకున్నారు. తొలుత మాజీఎంఎల్‌ఎ వైటి.రాజా నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం రోడ్డు మార్గంగుండా ఇరగవరం చేరుకుని పంచాయతీ చెరువు సమీపంలో ఉన్న ఆలయం వద్ద రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు కోటిలింగం, ద్వారపూడి సుబ్బిరెడ్డి, మరికొందరు రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనంగా ఎదురు డబ్బులు కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో కోత ఖర్చులతో పాటు పెట్టుబడులు భారీగా పెరిగాయన్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలని, మిల్లర్లు పెత్తందారులు కాదన్నారు. 40 కిలోల బస్తాకు రెండు కిలోలు అదనంగా, వంద కిలోల బస్తాకు ఐదు కిలోలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేయాలని 72 గంటలు అల్టిమేటం ఇచ్చి వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో పండిన పంటను ఆన్‌లైన్ పేరుతో తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని, ధాన్యం వెళ్లిన తర్వాత మిల్లర్లు ఫోన్ చేసి డబ్బులు కట్టించుకుంటున్నారని తెలిపారు. ఇక్కడ ధాన్యం [illegible] మిల్లులు పెడుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని చంద్రబాబు వివరించారు. తాను సిఎంగా ఉండగా తుఫాన్లు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించేవాడినని, ఈ ప్రభుత్వం రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలోకి రావడంలేదన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారన్నారు. ఇక్కడ ఉండే పౌర సరఫరాల శాఖ మంత్రి రైతులను ఎర్రిపప్ప, బుజ్జినాన్న అని పిలుస్తూ హేళనగా మాట్లాడటం తగదన్నారు. తాను వస్తుంటే దారి పొడవునా వైసిపి ఫ్లెక్సీలు కడుతూ సైకో ఆనందం పొందుతున్నారన్నారు. 40 సంవత్సరాల రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. రచ్చబండ కార్యక్రమం జరుగుతుండగా మధ్యలో ఒక వ్యక్తి లేచి మీరు అధికారంలో ఉన్నప్పుడు ఆయన, ఆయన అధికారంలో ఉన్నప్పుడు తమరు జనాల్లో తిరుగుతున్నారని, అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించడం లేదని అన్నారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో బూతులు మాట్లాడుతున్నారని, అక్కడ న్యాయం జరగడంలేదని, అందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానన్నారు. మాట్లాడిన వ్యక్తి వైసిపికి చెందినవారంటూ అక్కడ ఉన్న టిడిపి నాయకులు పక్కకు తీసుకెళ్లారు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చే సమయంలో ఉంగుటూరు చేరుకునేసరికి రెండు వాహనాలు చంద్రబాబు కాన్వాయ్‌లోకి చొరబడి తాడేపల్లిగూడెం చేరుకున్నాక పక్కకు వెళ్లిపోయినట్లు టిడిపి నాయకులు ఆరోపించారు. దీనిపై ఎస్‌పిజి పోలీసులు స్పందించలేదంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ విధానాలపై రైతుల్లో చర్చజరగాలని, చైతన్యం వచ్చినప్పుడే మన సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు ఎకరాకు రూ.పదివేల వరకూ నష్టపోతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడా మన్నారు. తుఫాన్లొచ్చినా కూడా హమాలీలను మార్చారని, ఇంతటి దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదన్నారు. అమరావతిని చిదిమేసారని చంద్రబాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, జవహర్, పీతల సుజాత, ఆరిమిల్లి రాధాకృష్ణ, శేషారావు పలువురు పాల్గొన్నారు. ఇరగవరం నుంచి తేతలి వరకూ చంద్రబాబు పాదయాత్ర సాగనుంది. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడనున్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈనెల 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. గురువారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవనంలో జి.రాజేశ్వరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, వారిఆదేశాల ప్రకారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

బిజెపి ఎంపీపై చర్యలు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - చాట్రాయి

మహిళ రెజ్లర్ల క్రీడాకారులపై వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సోమవరం గ్రామం రోడ్డులో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ రెజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రస్తుతం బిజెపి ఎంపీగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కొన్ని రోజులుగా మహిళా రెజ్లర్ల ధర్నా చేస్తున్నారన్నారు. వారి సమస్యల గురించి ప్రధాని, కేంద్ర మహిళా మంత్రులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెజ్లర్లకు న్యాయం చేయకపోతే ప్రజాసంఘాల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సునీల్, సురేష్ పాల్గొన్నారు.

దారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



నిర్మానుష్యంగా గురజ సెంటర్

మండలంలో గత నాలుగు రోజులుగా ఎండలు జనాలను దారెత్తిస్తున్నాయి. గత పదిరోజులుగా మండలంలో వర్షాలు కురిశాయి. వర్షాలు తగ్గిన తర్వాత ఈ నెల ఎనిమిదో తేది సోమవారం నుంచి మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి వడగాల్పులు తోడై ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రచండ భానుడి ప్రతాపంతో మండల జనం విలవిలలాడుతున్నారు. దీంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి రోడ్లపైకి వచ్చే పరిస్థితి లేదు. అంతేకాక గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోతలు విపరీతంగా పెరిగాయి. ఉక్కపోతకు తరచూ విద్యుత్ కోతలు తోడు కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. గురువారం ఇంటి నుంచి బయటకు రావాలంటే జనం భయపడిపోయారు. ముదినేపల్లిలోని వైకూడలి, గురజ సెంటర్, బస్టాండ్ తదితర ప్రాంతాలు మధ్యాహ్న వేళల్లో నిర్మానుష్యంగా మారాయి. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెంటిగ్రేడ్ పైబడి నమోదు కావడంతో పిల్లలు, వృద్ధులు, రోగులు, తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

కళారూపాల ద్వారా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై అధిక ధరలపై కళారూపాలను తయారుచేసి విస్తృత ప్రచారం చేసేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు శిక్షణ పొందాలని ఎపి ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ బల్ల కనకదుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ప్రజానాట్యమండలి జిల్లా ముఖ్యుల సమావేశం పిట్టా వీరయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలు, మతోన్మాద విధానాల వల్ల జరిగే నష్టాలను ప్రజానీకానికి తెలియజేసే విధంగా తేలిక భాషలో కథలు రూపొందించి, వాటిని ప్రజా సమూహాల్లో ప్రదర్శించేందుకు ప్రజానాట్య మండలి కళాకారులు సిద్ధం కావాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుదల కారణంగా ప్రజలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తెలియపరిచే విధంగా కళాకారులు ప్రదర్శనలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ నెల 21, 22 తేదీల్లో ప్రజా నాట్య మండలి కళాకారులకు ఏలూరులో శిక్షణ ఇవ్వాలని సమావేశం నిర్ణయించిందని దుర్గారావు తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా ఇన్‌ఛార్జి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజానాట్యమండలి కళారూపాలు తగ్గు మొహం పట్టాయన్నారు. తిరిగి జిల్లాలో ప్రజానాట్యమండలి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. ప్రజానాట్యమండలి నిర్మాణానికి పూర్తి సహకారం సిపిఐ అందిస్తుందని తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులు భజంత్రీ శ్రీనివాసరావు, గేదెల నాగేశ్వరరావు ఎంవి.చారి మాట్లాడారు. బాల కళాకారిని ఉప్పులూరి లక్ష్మీఅరుణ పాడిన విప్లవ గీతాలు సమావేశాన్ని ఉత్సాహపరిచాయి.

రైతు సంఘం నేతల గృహ నిర్బంధం

సిఎం కార్యాలయ ముట్టడికి వెళ్లొద్దంటూ నోటీసులు
తాము ఎలాంటి ఆందోళనలూ చేయడం లేదన్నా పట్టించుకోని పరిస్థితి
నిర్బంధాలతో రైతు ఉద్యమాలను ఆపలేరు : రైతుసంఘం



ఏలూరులో..



జంగారెడ్డిగూడెంలో..


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'మేము ఎలాంటి ఆందోళన కార్యక్రమాలూ చేపట్టడం లేదు.. ముఖ్యంగా సిఎం కార్యాలయ ముట్టడికి పిలుపు ఇవ్వలేదు.. అయినా మాకు నోటీసులు ఎందుకు ఇస్తున్నారు? ఎందుకు గృహ నిర్బంధం చేస్తున్నారు' అంటూ ఎపి రైతు సంఘం నేతలు అడుగుతున్నప్పటికీ పోలీసులు వినకుండా నోటీసులిచ్చి గృహ నిర్బంధం చేసిన ఘటన జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రైతుల సమస్యలపై ఈనెల 12న సిఎం కార్యాలయం ముట్టడికి వెళ్లొద్దంటూ ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌కు ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనం వద్ద పోలీసులు నోటీసు ఇచ్చారు. తమ సంఘం సిఎం కార్యాలయ ముట్టడికి పిలుపుఇవ్వలేదని చెబుతున్నా వినిపించుకోకుండా పోలీసులు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేయడం తగదని కె.శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. జిల్లాలో రైతాంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, తడిసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెప్పారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించకుండా రైతుల గొంతునొక్కి రైతు ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం అన్యాయమని విమర్శించారు. పోలీసుల బెదిరింపులతో రైతు ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని చెప్పారు. తమ సంఘం పిలుపు ఇవ్వకుండానే నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రైతు ఉద్యమ నాయకులను పోలీసులు ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముందస్తు అరెస్టులు, పోలీసు నిర్బంధాల వల్ల ప్రజల్లో చైతన్యం కలిగి ప్రభుత్వాలపై మరింత వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. తడిసిన ధాన్యం మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. నష్టపోయిన కౌలు రైతులకే పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జంగారెడ్డిగూడెం: రైతుల సమస్యలపై సిఎం కార్యాలయం ముట్టడికి వెళ్లొద్దంటూ ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబుకు పోలీసులు నోటీసు అందజేశారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా బొడ్డు రాంబాబు మాట్లాడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సిఎం కార్యాలయ ముట్టడికి పిలుపు ఇవ్వకుండానే పోలీసులు నోటీసులు ఇచ్చి ఇబ్బందుల గురి చేయడం తగదని ఖండించారు. జిల్లాలో రైతాంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తడిసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించకుండా రైతుల గొంతు నొక్కి రైతు ఉద్యమాలను అణచివేయాలనే ప్రభుత్వ ప్రయత్నాలు అన్యాయమని విమర్శించారు. పోలీసుల బెదిరింపులతో రైతు ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని చెప్పారు. రైతు ఉద్యమ నాయకులను పోలీసులు ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు




మాట్లాడుతున్న సీతారాం

అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో వరి, మిర్చి, మామిడి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు పండించిన పంటలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తామని గొప్పలు చెబుతూ ప్రచార ఆర్భాటం చేయడమే తప్ప ఆచరణలో అది జరగడం లేదని విమర్శించారు. వరి రైతులకు సరిపడా సంచులు కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. జిల్లాలో రైతాంగం దయనీయ స్థితిలో ఉందన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక, ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక రైతులు పంటను కల్లాల వద్దే ఉంచారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను మిల్లర్ల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో, బస్తా 80 కేజీలు ఉండాలని చెప్పి రేటు బాగా తగ్గిస్తున్నారని, దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిపిఎం నాయకులు, కార్యకర్తలు జిల్లాలోని ధాన్యం కల్లాల వద్దకు, కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఆందోళనలు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చే విధంగా అధికారులకు తగిన ఉత్తర్వులు జారీ చేసి పంటలు కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని సీతారాం డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ కార్మికులు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యంత్రాలు వచ్చి వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి కేటాయింపులు తగ్గించిందని, ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీలో వ్యవసాయ కార్మికులకు రోజు కూలీ రూ.600, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని సీతారాం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పూర్తయిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, జగనన్న కాలనీలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించి డబ్బులు చెల్లించినవారికి, అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అసైన్డ్, సీలింగ్ భూములు దళితులకు, పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, జి.నరసింహారావు, ఎం.జీవరత్నం, వై.నాగేంద్రరావు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పి.మంగరాజు, జి.వెంకట్రావు, ఎన్.నరసింహ, టి.సత్యనారాయణ, టి.దుర్గారావు పాల్గొన్నారు.

భీమడోలులో గాలి, వాన బీభత్సం

విరిగిపడిన చెట్లు
నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు
నిలిచిన విద్యుత్ సరఫరా



ఎంఎంపురం రహదారిలో కారుపై కూలిన చెట్టు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, కురిసిన వాన భీభత్సవాన్ని సృష్టించాయి. ఈదురు గాలులు సుమారు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వీచి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. ఎక్కువ నష్టం పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలో వాటిల్లింది. పూళ్ల వద్ద ఈదురుగాలులకు జాతీయ రహదారి పక్కన ఉన్న బడ్డీలు గాలికి ఎగిరి కాలువలో పడ్డాయి. రోడ్డు పక్కన ఉన్న కొన్ని ఆటోలు రోడ్డుపై నుంచి ఏలూరు కాలువలోకి దూసుకుపోయి చిక్కుబడ్డాయి. ఈదురుగాలుల ప్రభావంతో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఉన్న చెట్లు పడిపోవటంతో పూళ్ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. భీమడోలు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పూళ్ల- ఎంఎంపురం రోడ్డుపై చెట్లు పడటంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్యకుమార్ యుద్ధ ప్రాతిపదికన రోడ్లపై పడిన చెట్లను యంత్రాల సాయంతో తొలగించి రాకపోకలను క్రమ బద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే క్రమంలో చెట్టు పడి చిక్కుకుపోయిన కారును వెలికి తీశారు. ఈదురుగాలులతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌పై దీని ప్రభావం పడడంతో దాని పరిధిలోని అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంబరుపేట నుంచి పూళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33 కెవి లైన్ల విద్యుత్ స్తంభాలన్నీ కూలిపోయాయి. ఇదే క్రమంలో పూళ్ల గ్రామపంచాయతీలోని పరిధిలోని 50 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ సంఘటనా స్థలాలకు చేరుకుని వివిధ శాఖలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. సహాయక పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు మాట్లాడుతూ పూళ్ల గ్రామంలో విద్యుత్ సరఫరాకు రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. కూలిపోయిన స్తంభాలకు తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పూళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కలిగిన నష్టాలను అంచనా వేయాల్సి ఉందన్నారు. నష్టం ఎక్కువగానే ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. గ్రామంలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా పునరుద్ధరించే అవకాశాలు పరిశీలిస్తుమని తెలిపారు.




విద్యుత్ సహాయక పనులను పర్యవేక్షిస్తున్న తహసిల్దార్

పశుసంవర్ధక శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు టౌన్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పొరుగు సేవల పద్ధతిలో పశు సంవర్ధకశాఖలో అప్కాస్ నియమ నిబంధనల ప్రకారం మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక హాస్పిటల్ అటెండెంట్, ఎనిమిది ల్యాబ్ అటెండెంట్ పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు టెక్నికల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా గుర్తింపు పొందిన సంస్థ నుంచి పిజిడిసిఎతో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి అవసరమైన అర్హత డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. హాస్పిటల్ అటెండెంట్, ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు ఎస్ఎస్‌సి విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. 18 నుంచి 42 సంవత్సరవాల మధ్య వయసు ఉండాలని తెలిపారు. (ఎస్‌సి, ఎస్‌టి, బిసి) అభ్యర్థులకు ఐదు సంవత్సరవాలు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు మూడు సంవత్సరాలు, వికలాంగ అభ్యర్థులకు పది సంవత్సరాలు సడలింపు కలదని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు సంయుక్త సంచాలకులు వారి కార్యాలయంలో అందించాలని తెలిపారు.

చాట్రాయి ఎంపిడిఒగా జాన్సీరాణి

ప్రజాశక్తి - చాట్రాయి


బాధ్యతలు చేపడుతున్న జాన్సీరాణి

చాట్రాయి ఎంపిడిఒగా జాన్సీరాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇప్పటివరకు ఎన్‌టిఆర్ జిల్లా విసన్నపేట మండలంలో ఇఒపిఆర్‌డిగా పనిచేశారు. ఇప్పటివరకు చాట్రాయి ఎంపిడిఒగా బాధ్యతలను నిర్వహించిన ఎన్.మురళీమోహన్ చాట్రాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సూపరింటెండ్‌గా బాధ్యతలు చేపడతారు.

సావిత్రి సమస్య పరిష్కరించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దొరమామిడి గ్రామానికి చెందిన కొప్పుల సావిత్రి భూ సమస్య పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. ఆమె భర్త పేరు మీద 50 ఎకరాల భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఉందని, వాస్తవానికి 70 సెంట్లు మాత్రమే ఉందని, ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు కావడంతో సావిత్రికి ప్రభుత్వ పథకాలు అందడంలేదని చెప్పారు. అధికారుల చుట్టూ కాళ్ల అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈ సమస్యను ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సావిత్రి భూ సమస్య పరిష్కరించాలని ఫ్రాన్సిస్ కోరారు. లేకపోతే ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

రోషన్‌కుమార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సొంగా రోషన్‌కుమార్ సేవలు అభినందనీయమని ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని ఫాతిమాపురం చర్చికి దైవ సందేశం వినడానికి, ప్రార్థన కార్యక్రమాలకు రూ.లక్ష విలువైన సౌండ్ సిస్టమ్స్ బహుకరించారు. అంతరం చర్చి ఫాదర్ డేవిడ్ మాట్లాడుతూ రోషన్‌కుమార్ నిరాడంబరమైన జీవన విధానం, వారి ఆశయాలు ఎంతో ఉత్తమమైనవని, అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. చింతలపూడి నియోజకవర్గంలో రోషన్‌కుమార్ వంటి ప్రజా నాయకులు ఎంతో అవసరమని, ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు రాజా రెడ్డి, టిడిపి నాయకులు మానేపల్లి రాజారావు పాల్గొన్నారు.

14 నుంచి యోగా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి భావన రుషి నివాస గృహం వద్ద ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగా శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. మే 14వ తేదీ నుంచి జూన్ పదో తేదీ వరకు శిక్షణా తరగతులు కొనసాగుతాయని వారు తెలిపారు. పది నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గలవారు శిక్షణా తరగతుల్లో పాల్గొనేందుకు అర్హులని వారు తెలిపారు. శిక్షణ తీసుకున్నవారికి ఆరోగ్య సమస్యలైన మెడనొప్పి, నడుమునొప్పి, స్పాండిలైటిస్, సయాటికా, మలబద్ధకం, అజీర్తి, గ్యాస్ సమస్యలు, ఒత్తిడి, థైరాయిడ్, ఆస్తమా, ఊబకాయం, రక్తపోటు వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు తమ పేర్లను నిర్వాహకులు వద్ద ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని బొర్రంపాలెం సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.ఉషారాణి అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతని దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. బాల్య వివాహం చట్ట విరుద్ధమని, బాల్య వివాహానికి సహకరించిన వారు, తల్లిదండ్రులు, ప్రోత్సాహించిన వారు శిక్షార్హులని చెప్పారు. బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని తెలిపారు. బాల్య వివాహాలకు పాల్పడితే రెండు సంవత్సరాల కఠిన శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పిడుగుపాటుకు పేలిన గ్యాస్ సిలిండర్

ప్రజాశక్తి - చింతలపూడి

పిడుగుపడి ఇంట్లో గ్యాస్ పేలిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాద్రిగూడెంలో యలగం రాఘవరావు తండ్రి చినలక్ష్మయ్య తాటాకింటిపై గురువారం సాయంత్రం ఐదు గంటలకు పిడుగు పడి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మంటలు చెలగేరి తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న సుమారు రూ.మూడు లక్షల నగదు దగ్ధమైంది.

113 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో ఏడో సారి భారీఎత్తున సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి మేరీ ప్రశాంతి విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 113 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.22.60 లక్షల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 1458 సెల్‌ఫోన్లకు సంబంధించి ఫిర్యాదులు అందగా వాటిలో సుమారు 821 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.1.69 కోట్లకు పైగా ఉంటుందని, రికవరీ శాతం సుమారుగా 58గా ఉందని ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, సిసిఎస్ సిఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మామిడి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


ప్రజాశక్తి - ముసునూరు

మామిడి కాయ కోతలకు వెళ్లి చెట్టుపై నుంచి కింద పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మాజీగూడెం గ్రామానికి ఈదర సుబ్బరాజు గత నెల 24వ తేదీన ముసునూరు మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ఉప్పే శ్రీనుకు చెందిన తోటలో మామిడి కాయలు కోసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాయలు కోస్తుండగా చెట్టుపై నుండి పడి గాయాలపాలయ్యాడు. దీంతో అక్కడివారు సుబ్బరాజును రమణక్కపేట ఆర్‌ఎంపి డ్రాక్టర్ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం ధర్మాజీగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన సుబ్బరాజును గురువారం ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య జాన్సి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఇబి సిఐ సుబ్రహ్మణ్యం అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని నారాయణపురం వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో భీమడోలు సిఐ ఎయుబి.సుబ్రహ్మణ్యం గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. నారాయణపురం టూరింగుపేట సెంటర్‌కు చెందిన వీరమల్లు చంద్రశేఖర్ 500 గ్రాముల గంజాయిని తన వాహనంలో తరలిస్తూ పట్టుపడ్డాడు. చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.


నూతన వధూవరులు రామకృష్ణ, మహేశ్వరి

శివాపురంలో కులాంతర వివాహం

ప్రజాశక్తి - చాట్రాయి

కులాంతర వివాహాల ద్వారా మాత్రమే నిచ్చెన మెట్ల కులవ్యవస్థ నిర్మూలించవచ్చన్న మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఓ యువకుడు, యువతి కులాంతర వివాహం చేసుకున్నారు. చింతలపూడి మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన రామకష్ణ, చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామానికి చెందిన అన్నపురెడ్డి మహేశ్వరి గురువారం రాత్రి కులాంతర వివాహం చేసుకున్నారు. రామకృష్ణ ఎంబిఎ, మహేశ్వరి ఎంఎస్‌సి జువాలజీ చదివారు. వీరిద్దరు చదువుకుంటూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఒకే సామాజిక తరగతికి చెందినవారైనా వీరి ఉపకలాలు వేరు. కులాలు వేరైనా తమ తమ తల్లిదండ్రులను, బంధువులను ఒప్పించి వివాహం చేసుకున్నారు. దళిత వర్గాలు, వామపక్ష వాదులు కులాంతర వివాహాలు జరగడం మంచి పరిణామమని, ఈ దేశంలో కులాలు పోవాలంటే ఇలాంటి కులాంతర వివాహాలు జరగాలంటూ వ్యాఖ్యనిస్తున్నారు.

అటవీ శాఖ ప్లాంటేషన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ ప్లాంటేషన్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు సబ్ డిఎఫ్ఒ సౌజన్య తెలిపారు. మండలంలోని జీలుగుమిల్లి, కామయ్యపాలెం సెక్షన్ పరిధిలోని జిలెళ్లగూడెంలో నూతనంగా నాటిన మారు జాతి ప్లాంటేషన్‌లను రేంజ్ అధికారిణి శ్రీవాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని అటవీ శాఖ పరిధిలో ఉన్న మారు జాతి ప్లాంటేషన్‌లను అభివృద్ధి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దినేష్, బీట్ ఆఫీసర్ మారేష్ ఉన్నారు.

పిఎంజెజెబివైని వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

బీమా పథకాలు ప్రమాద సమయాల్లో కుటుంబానికి ఆర్థిక రక్షణ కలిగిస్తాయని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. తక్కెళ్లపాడు సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా సురక్ష బీమా యోజన రెండు పథకాల్లో కేవలం రూ.456 చెల్లించి ఉంటే ప్రమాద సమయాల్లో ఆ కుటుంబానికి ఎంతో భరోసాని కలిగిస్తుందన్నారు. సహజ మరణానికి రూ.రెండు లక్షలు, ప్రమాదం సంభవిస్తే మరో రూ.రెండు లక్షల జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. అవగాహన లేకపోవడం వల్ల బీమాలో చేరకపోవడంతో ప్రమాదం సంభవించినప్పుడు కుటుంబాలు నలిగిపోతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ బీమా పొందేవిధంగా గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండలు, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్, బ్యాంక్ మిత్ర జాన్సీరాణి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

దిశాయాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి, తుక్కులూరు, మొర్సపూడి, మరిబంధం, సీతారామపురం పలు గ్రామాల్లో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో దిశా యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని గురువారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ ఆర్.అంకబాబు మాట్లాడుతూ ప్రతి మహిళా తన సెల్ ఫోన్‌లో తప్పనిసరిగా దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మహిళలు ఆపదలో ఉనప్పుడు బయట పడేందుకు ఈ యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రూ.ఆరు కోట్లతో శ్రీనివాసపురం రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ ఎలిజా రూ.6 కోట్లతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఆనంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జగన్ పాలనలో సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఇప్పటివరకు శ్రీనివాసపురంలో రూ.30 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి ములగలంపల్లి వెళ్లే రోడ్డుకు రూ.3.75 కోట్లతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసపురం ఇన్‌ఛార్జి సర్పంచి పోలినాటి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జి, ఎంపిపి కొదమ జ్యోతి, ఎంపిటిసి సభ్యులు జుజ్జువరపు తాతారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని 30, 31 వార్డుల్లో గురువారం ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని సందర్శించి వివిధ సమస్యల గురించి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యల పట్ల సత్వరమే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను మేయర్ నూర్జహాన్ పెదబాబు గురువారం ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం మంచినీటి కూలర్‌ను ఏర్పాటు చేసినట్లు మేయర్ నూర్జహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపేయి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు జిజ్జవరపు విజయనిర్మల, సత్యవతి, కల్వకొల్లు సాంబ, జయకర్, సబ్బన శ్రీనివాసరావు, జనపరెడ్డి కృష్ణ, కోయ సత్తిబాబు, అద్దంకి హరిబాబు, దారపు తేజ, కిలాడి దుర్గారావు, జగదీష్ పాల్గొన్నారు.

కదిలిన రేషన్ పంపిణీ వాహనం

పేదలకు బియ్యం అందజేత

ప్రజాశక్తి వార్తకు స్పందన


బియ్యం పంపిణీని పర్యవేక్షిస్తున్న విఆర్ఒ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొరాయించిన రేషన్ వాహనం ఎట్టకేలకు కదిలింది. కొన్ని రోజులుగా మరమ్మతులకు గురై మూలనపడిన వాహనం గురువారం రోడ్డెక్కింది. దీంతో గత పది రోజులుగా మండలంలోని పలు గ్రామాలకు నిలిచిన రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మొరాయించిన రేషన్ పంపిణీ వాహనం, బియ్యం అందక ప్రజలు అవస్థలు శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఎండియు ఆపరేటర్‌తో మాట్లాడి ప్రజలకు గురువారం వాహనం ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో పదిరోజులుగా బియ్యం పంపిణీ జరగక ఇబ్బంది పడిన పేదలు, వృద్ధులు ఊపిరి పీల్చుకున్నారు. పెయ్యేరు ఎస్‌సి ఏరియాలో జరిగిన బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ విఆర్ఓ కారే కేశవ దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లు వాహనాలకు ఏమైనా మరమ్మతులు వస్తే నెలఖరులోపు చేయించుకుని నెల మొదటి తేదీ నుంచి ఇంటింటికి బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు.

డిసెంబర్‌లోగా వంద పడకల ఆసుపత్రి పూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని డిసెంబర్‌లోగా పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో రూ.1,22,49,322తో ఏర్పాటు చేసిన వైద్య పరికరాల ల్యాబ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో ఎంఎల్‌ఎ మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో, సిబ్బందితో ఎంఎల్‌ఎ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తమ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. ఏరియా ఆసుపత్రికి వస్తున్న రోగులకు సకాలంలో వైద్యం అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందిని ఆయన అభినందించారు. సిఎం జగన్ ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది కొరత లేకుండా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు భరత్‌రెడ్డి, కాంతారావు, మిర్యాల దిలిప్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


కార్మికులకు హైజిన్ కిట్లు


కిట్లు పంపిణీ చేస్తున్న మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య కార్మికులకు 500 హైజిన్ కిట్లను మేయర్ నూర్జహాన్ పెదబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ ఆపదలో ఉన్నవారికి ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. కరోనా విపత్తు సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుధ్య కార్మికులు సేవలు చేశారని, అటువంటివారికి రెడ్‌క్రాస్ సొసైటీ సబ్బులు, బ్రష్‌లు, పేస్టులతో కూడిన హైజిన్ కిట్లను పంచడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డికి, రెడ్‌క్రాస్ బృందానికి అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు సేవ చేయడానికి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ చెన్న నాగభూషణం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


ప్రతిభ కనబరచిన విద్యార్థులతో ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో 2022-2023లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను గురువారం స్థానిక వి.కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించారు. ముదినేపల్లి ఎస్ఐ షణ్ముఖసాయి అధ్యక్షతన నిర్వహించిన సభలో డిఎన్ఆర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు మంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారికి భవిష్యత్ పట్ల అవగాహన కలిగే విధంగా, వారిని కర్తవ్యం వైపు సాగే విధంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఎస్ఐ షణ్ముఖసాయి అభినందనీయులన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 18 మంది విద్యార్థులకు శాలువలు కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, వైస్ ఎంపిపి రాధ, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, నాయకులు కె.విష్ణువర్ధన్, ముత్యాల రాంబాబు, రాచూరి కుమార్, సాయి, రాజా, సతీష్, కైకలూరు రూరల్ సిఐ వైవివిఎల్.నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమ అరెస్టు, గృహ నిర్బంధం సిగ్గుమాలిన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. గురువారం తన గృహానికి వచ్చి అరెస్టు చేస్తున్నట్లు పోలీసు శాఖ సమాచారం ఇవ్వడంతో కారణం తెలియజేయమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక నీళ్ల నములుతున్నారని ఎద్దేవా చేశారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కుఅని, వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, నిరసన తెలిపే హక్కు లేకుండా ప్రభుత్వం చీకటి జిఒ ఒకటి విడుదల చేసిందన్నారు. దీనిపై హైకోర్టు ప్రభుత్వానికి చివాట్లు పెట్టినా చీమకుట్టినట్లయినా లేదన్నారు. కారణం లేకుండా అరెస్టు చేయడం వల్ల నిత్యజీవితంలో కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతుందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. ప్రభుత్వం, పోలీసు శాఖ తమ దుందుడుకు చర్యలను విరమించుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్బంధాలను లెక్క చేసే ప్రసక్తే లేదని పోరాటాలు కొనసాగిస్తామని ప్రభాకర్ తెలిపారు.

13న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఈ నెల 13న మధ్యాహ్నం రెండు గంటలకు విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లా యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రబోస్ గురువారం తెలిపారు. 2007 జనవరి ఒకటి తరువాత జన్మించినవారు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

వధూవరులకు ఎంఎల్‌సి జయమంగళ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

నిండు నూరేళ్లు పిల్లాపాపలతో చల్లగా సంతోషంగా ఉండాలని నూతన వధూవరులను శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ఆశీర్వదించారు. మండవల్లిలో బల్లవరపు పాపయ్య కుమారుడు వివాహ వేడుకల్లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఆర్‌సిఎం చర్చిలో జరిగిన వివాహంలో ఆయన పాల్గొని ఆశీర్వదించారు. ఆయనతో పాటు నారగని వీర వెంకట నాగేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, పళ్లెం ఏడుకొండలు ఉన్నారు.

పట్టాభిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఎంఎల్ఎ ఎలిజాతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజియన్ చైర్‌పర్సన్ వందనపు సాయి బాలపద్మ, సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.